చట్టసభలు రాజ్యాంగ విలువలను గౌరవించాలి

పాట్నా సదస్సులో శాసనమండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): చట్టసభలు రాజ్యాంగ విలువలను గౌరవించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. పాట్నాలో జరుగుతున్న 85వ ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో మంగళవారం వారు ప్రసంగిస్తూ.. భారత రాజ్యాంగాన్ని అనుసరించి పార్లమెంట్ రూపొందించిన చట్టాలు ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడుతున్నాయని, చట్టసభలు ప్రజల హక్కులను రక్షిస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యం, సమన్యాయం, సమానత్వం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. కాన్ఫరెన్స్‌లో శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 12 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు

ఇటీవల గెజిట్ విడుదల

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): స్టేషన్‌ఘన్‌పూర్, చేవెళ్లతో పాటు రాష్ట్రంలో మొత్తం 12 మున్సిపాలిటీలను కొత్తగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అలాగే భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, మహబూబ్‌నగర్ 3 మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా మారుస్తూ గెజిట్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో పట్టణ పరిధి పెరిగింది.143గా ఉన్న మొత్తం మున్సిపాలిటీలు (మున్సిపాలిటీ కార్పొరేషన్లతో సహా) 155కి చేరుకున్నట్టు మున్సిపల్ శాఖ అధికారులు తెలిపారు. వాస్తవానికి ఈ గెజిట్ విడుదల చేసి 15 రోజులు దాటింది. 4వ తేదీనే గెజిట్ విడుదలైంది.

కొత్త మున్సిపాలిటీలు ఇవే..

స్టేషన్‌ఘన్‌పూర్, కేసముద్రం, ఎడులాపురం, అశ్వరావుపేట్, చేవెళ్ల, మొయినాబాద్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, దేవరకద్ర, మద్దూరు, పరకాల మున్సిపాలిటీలుగా ఆవిర్భవించనున్నాయి. భద్రాద్రి కొత్తగూడం, మంచిర్యాల, మహబూబ్‌నగర్‌లను కార్పొరేషన్లుగా హోదా పెంచారు. కాగా ప్రస్తుత మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న పాలక మండళ్లు ఈ నెల 26తో ముగియనున్నది.

అక్రమంగా కిడ్నీల మార్పిడి

సరూర్‌నగర్‌లో ఆరు నెలలుగా దందా

- అలకనంద దవాఖానలో చట్టవిరుద్ధంగా ఆపరేషన్లు
- హాస్పిటల్‌పై దాడిచేసి పట్టుకున్న డీఎంహెచ్‌వో, పోలీసులు

దవాఖానలో విచారణ చేస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ)/ ఆర్కేపురం: ఎక్కడో మారుమూల భవనాల్లో ఒక దవాఖానను సెట్ చేసి, అక్కడికి అమాయకులను ఎత్తుకొచ్చి వారి అవయవాలను దోపిడీ చేసే ముఠాలు సాధారణంగా సినిమాల్లో కనిపిస్తుంటాయి. కానీ హైదరాబాద్ నగరం నడిబొడ్డున నిఘా వ్యవస్థ కండ్లుగప్పి ఒక దవాఖానలో అక్రమంగా కిడ్నీ మార్పిడులు జరుగుతున్న ఉదంతం బట్టబయలైంది. ఈ దందా వివరాలను రంగారెడ్డి డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ మంగళవారం వెల్లడించారు. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో డాక్టర్ సుమంత్ అలకనంద పేరుతో ఓ దవాఖానను ఏర్పాటు చేశాడు. ఇక్కడ అక్రమంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నారు. కిడ్నీ అవసరమైన వారిని, కిడ్నీ ఇచ్చే వారిని ఒకేసారి పిలిపించి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువగా ఇక్కడికి వస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ విషయంపై మంగళవారం మధ్యాహ్నం డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లుకు సమాచారం వచ్చింది. డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్యతో కలిసి అందరు ఆ దవాఖానపై దాడి చేశారు. అక్కడున్న కిడ్నీ బాధితులను గాంధీ దవాఖానకు తరలించారు. డాక్టర్ సుమంత్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, దవాఖానను సీజ్ చేశామని పోలీసుల తెలిపారు.

ఒకో కిడ్నీకి రూ. 55 లక్షలు

ఒక్కో కిడ్నీ మార్పిడికి రూ.55 లక్షలు వసూలు చేస్తున్నట్టు బయటపడింది. కిడ్నీ డోనర్స్, రిసీవర్స్‌కు ప్రదీప్ అనే వ్యక్తి మధ్యవర్తిగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే పదుల సంఖ్యలో మార్పిడి జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయంపై మీడియేటర్లు, వైద్యులు, డోనర్స్‌కు మధ్య పంపకాల విషయంలో తేడాలు రావడంతోనే డీఎంహెచ్‌వోకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి

చట్టవిరుద్ధంగా జరుగుతున్న కిడ్నీ మార్పిడుల వ్యవహారంపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఈ కేసులో భాగస్వాములైన డాక్టర్లు, హాస్పిటల్ యాజమాన్యం, ఇతర వ్యక్తులను ఉపేక్షించొద్దని, చట్ట ప్రకారం కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. నిఘా పెట్టాలని పోలీస్ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు.

హైదరాబాద్ తాగునీటిపై ఏపీ కొర్రీ

- సుంకిశాల పథకాన్ని నిలిపివేయాలని కృష్ణాబోర్డుకు లేఖ
- అనుమతులు లేకుండానే పనులు చేపట్టారని ఆరోపణ
- ఉమ్మడి రాష్ట్రంలోనే సుంకిశాలకు రూపకల్పన
- కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలోనే పూర్తయిన భూసేకరణ
- కేసీఆర్ హయాంలోనే 70-80 శాతం పూర్తయిన ప్రాజెక్టు పనులు
- నాడు సుంకిశాలకు బదులు మాధవరెడ్డి ప్రాజెక్టును చేపట్టిన బాబు
- నేడు మళ్లీ అధికారానికి రాగానే తాగునీటి సరఫరాను అడ్డుకొనే కుట్ర

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 21 (నమస్తే తెలంగాణ): మినీ భారతంలాంటి హైదరాబాద్ తాగునీటి సరఫరాకు శాశ్వత పరిష్కారమైన సుంకిశాల పథకంపై ఆంధ్రప్రదేశ్ సర్కారు ఫిర్యాదుకు ఒడిగట్టింది. ప్రాజెక్టును అడ్డుకోవాలంటూ కృష్ణా బోర్డుకు లేఖ రాసింది. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తింది. కాగా జల వివాదాలపై ట్రిబ్యునల్ విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఈ అంశంపై చర్చకు బోర్డు నిరాకరించింది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే సుంకిశాల పథకానికి రూపకల్పన చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ జలాశయంలో నీటిమట్టం 510 అడుగుల కంటే తక్కువకు పడిపోయిన ప్రతిసారీ నగర నీటి సరఫరా ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. దీంతో శాశ్వత పరిష్కారంగా కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టి... 70-80 శాతం పనులు పూర్తి చేసింది.

ఉమ్మడి ఏపీలోనే శంకుస్థాపన

హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కృష్ణా జలాలు అత్యంత కీలకం. హైదరాబాద్‌లో జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటిలో సగంవరకు దాదాపు ఈ జలాలే ఉంటాయి. నల్లగొండ జిల్లా నుంచి మూడు పైపులైన్ల ద్వారా రోజుకు 270 మిలియన్ గ్యాలన్ల (ఏటా 16.5 టీఎంసీలు) నీటిని హైదరాబాద్ తరలిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సుంకిశాల పథకానికి శంకుస్థాపన జరిగింది. అప్పట్లోనే నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల గ్రామం వద్ద నాగార్జునసాగర్ జలాశయం ఫోర్‌షోర్ నుంచి నీటిని సేకరించేందుకు అక్కడ భూసేకరణ కూడా పూర్తి చేశారు. కానీ పలు కారణాలతో పథకం పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత చంద్రబాబు హయాంలో సుంకిశాలను పక్కనపెట్టి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను సేకరించి హైదరాబాద్‌కు అందించారు. అప్పటికే జంట జలాశయాలు, సింగూరు-మంజీరా నుంచి నీటి సరఫరా జరుగుతున్నా పెరిగిన జనాభాకు అనుగుణంగా అవసరాలు తీర్చలేకపోయాయి. ఈ సమయంలో కృష్ణాజలాల సరఫరాతో నగర నీటి అవసరాలు తీరాయి. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి.. శుద్ధి చేసిన తర్వాత నగరానికి సరఫరా చేస్తారు. అయితే నాగార్జునసాగర్ జలాశయంలో 510 అడుగులు, అంతకంటే ఎక్కువ నీటిమట్టం ఉంటేనే మాధవరెడ్డి ప్రాజెక్టులోని మోటార్లు సాఫీగా నడుస్తాయి. ఇలా కాకుండా నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ నుంచి కూడా సుంకిశాల ద్వారా నీటిని తీసుకోవచ్చు. అందుకే కేసీఆర్ ప్రభుత్వం మహానగర నీటి సరఫరాకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఈ పథకాన్ని మొదలుపెట్టింది. నిర్ణీత గడువు మేరకు ఇప్పటికే పథకం అందుబాటులోకి రావాల్సి ఉన్నప్పటికీ సర్కారు పర్యవేక్షణలోపం, నిర్మాణ సంస్థ మేఘా తప్పిదంతో రిటెయినింగ్ వాల్ కుప్పకూలి పనులు నిలిచిపోయాయి.

సుంకిశాలకు అనుమతులు లేవట!

కృష్ణాబోర్డు సమావేశం మంగళవారం జరిగిన సమయంలో ఈ అంశాన్ని ఏపీ ప్రస్తావించింది. ఇంతకుముందే గత నెల రెండున సుంకిశాల అంశాన్ని ఎజెండాలో చేర్చాలని కోరుతూ ఏపీ ప్రత్యేక ప్రధానకార్యదర్శి బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. కృష్ణా బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండానే సుంకిశాల పనులు కొనసాగిస్తున్నారని, దీనిద్వారా ఆంధ్రప్రదేశ్ నీటి వాటాపై ప్రభావం పడుతున్నదని పేర్కొన్నారు. తగిన అనుమతులు వచ్చే వరకూ సుంకిశాల పనులు నిలిపివేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాల కిందటనే సుంకిశాల పథకాన్ని రూపొందించారు. అయినప్పటికీ ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకంపై ఫిర్యాదు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

సుంకిశాల కేవలం ప్రత్యామ్నాయమే

హైదరాబాద్ తాగునీటి కోసం ఇప్పటికే ఏటా 16.5 టీఎంసీల నీటిని తరలిస్తున్నారని, సుంకిశాల పథకం ద్వారా అదనంగా మరో 20 టీఎంసీలు తరలించనున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. వాస్తవానికి సుంకిశాల పథకం మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి కాకుండా నేరుగా నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటిని సేకరించే ప్రత్యామ్నాయ, శాశ్వత పరిష్కార మార్గం. ఈ విషయం ఏపీ ప్రభుత్వానికి అధికారులకు తెలియనిది కాదు. సుంకిశాల నుంచి తరలించే నీటిని కూడా ప్రస్తుతం నగరానికి నీటిని సరఫరా చేస్తున్న ఆ మూడు పైపులైన్ల ద్వారానే తరలించాల్సి ఉంటుంది. అంటే ఏటా 16.5 టీఎంసీల నీటినే తరలించేందుకు అవకాశముంది. కానీ ఇప్పటికిప్పుడు అదనంగా 20 టీఎంసీలను తరలించనున్నారని ఏపీ సర్కారు తన లేఖలో ఆరోపించడం లేని సమస్యను భూతద్దంలో చూపి పథకాన్ని అడ్డుకునేందుకేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

కేఆర్ఎంబీ సమావేశంలో తెలంగాణ,ఏపీ అధికారులు

66:34% నీటివాటా తాత్కాలికమే

- 71:29% పంపిణీకి ప్రతిపాదనలు
- ప్రస్తుతం 50:50% వాడుకుంటాం
- కేఆర్ఎంబీకి తేల్చిచెప్పిన తెలంగాణ

హైదరాబాద్, జనవరి21 (నమస్తే తెలంగాణ): కృష్ణాజలాలను 66:34% నిష్పత్తిలో వినియోగించుకోవాలని 2015లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు చేసుకున్నది తాత్కాలిక ఒప్పందమేనని, అదీ ఆ ఏడాదికే పరిమితమని రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తేల్చిచెప్పారు. నదీ పరీవాహక ప్రాంతం ఆధారంగా తెలంగాణకు 71%, ఏపీకి 29% జలాలను కేటాయించాలని ప్రతిపాదనలు పెట్టామని తెలిపారు. ట్రిబ్యునల్ విచారణ పూర్తయ్యేవరకు ఈ ఏడాది నుంచి కృష్ణాజలాలను 50:50 నిష్పత్తిలో వినియోగించుకుంటామని బోర్డుకు స్పష్టంచేశారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) 19వ సమావేశం హైదరాబాద్ జలసౌధలో మంగళవారం జరిగింది. బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ నేతృత్వంలో కొనసాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. బేసిన్ అవతలికి ఏ మేరకు కృష్ణాజలాలు తరలిపోతున్నాయో లెక్క తేల్చేందుకు 2వ దశలో 11 ఔట్‌లెట్లపై టెలీమెట్రీలను ఏర్పాటు చేయాలని, అందుకు రూ.6 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశామని, ఆ నిధులను తొలుత భరించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని కార్యదర్శి రాహుల్‌బొజ్జా వెల్లడించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను యథాతథ స్థితికి తేవాలని, తెలంగాణకు అప్పగించాలని బోర్డును కోరారు. శ్రీశైలం డ్యామ్ భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని ఈఎన్సీ అనిల్‌కుమార్ కోరారు.

పాతపద్ధతిలోనే నీటివాటాలు: ఏపీ

కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి గత ఒప్పందం మేరకు 66:34 నిష్పత్తినే కొనసాగించాలని ఏపీ తరపున ఈఎన్సీ వెంకటేశ్వరరావు కోరారు. నీటి వాటాల అంశంపై త్రిమెన్ కమిటీలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటుందని చైర్మన్ అతుల్‌జైన్ వెల్లడించారు. సమావేశంలో తెలంగాణ అధికారులు విజయభాస్కర్, విజయ్‌కుమార్, బోర్డు అధికారులు రఘునాథ్, శివశంకర్, శ్రీధర్, వేణు, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రోస్ భూములను పరిరక్షిస్తాం

- గత పదేండ్లలో ఎక్కడా కబ్జా కాలేదు
- ఇప్పుడూ అన్యాక్రాంతం కాకుండా చర్యలు
- ఆగ్రోస్ చైర్మన్ బాలరాజు, ఎండీ రాములు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఆగ్రోస్‌కు చెందిన భూములు గత పదేండ్లలో ఎక్కడా కబ్జా కాలేదని ఆ సంస్థ చైర్మన్ కాసుల బాలరాజు, ఎండీ రాములు వెల్లడించారు. ఆగ్రోస్ భూములన్నీ అన్యాక్రాంతమయ్యాయనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని, సదరు భూములను పరిరక్షించేందుకు ప్రణాళిక రూపొందించినట్టు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆగ్రోస్ భూములను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ బాలరాజు మాట్లాడుతూ.. ఆగ్రోస్ సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా 590 ఎకరాల భూములు ఉండగా.. అత్యధికంగా బెల్లంపల్లిలో 543, మౌలాలీలో 23, చింతల్‌లో 10 ఎకరాలు ఉన్నట్టు వెల్లడించారు. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఉన్నప్పుడు మౌలాలీలోని 3 ఎకరాలు కబ్జాకు గురైనట్టు వివరించారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేశామని స్పష్టం చేశారు. చింతల్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని భూములను లీజుకు ఇచ్చామని, కొందరు ఆ భూములను వినియోగించడం లేదని, మరికొంతమంది అద్దె చెల్లించడం లేదని పేర్కొన్నారు. వారికి నోటీసులు జారీ చేశామని, త్వరలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండీ రాములు మాట్లాడుతూ.. భూములను సర్వే చేయిస్తున్నామని, వాటిని అభివృద్ధి చేసి గోదాములు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు.

తాంసి(కే)లో పులి సంచారం!

తాంసి(కె) ప్రాంతంలో రోడ్డు దాటుతున్న పులి

భీంపూర్, జనవరి 21 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని రాష్ట్ర సరిహద్దున గల తాంసి(కే) శివారు రిజర్వాయర్ సమీపంలో పెద్ద పులి సంచరించినట్టు స్థానికులు తెలిపారు. రిజర్వాయర్ పనులకు వెళ్లే కార్మికులు, సిబ్బంది సోమవారం రాత్రి పిప్పల్‌కోటి-తాంసి(కే) వెళ్లే రోడ్డును పులి దాటుతుండగా చూసి వీడియో తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో వైరల్ అయింది. ఈ విషయం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్ సమీపంలో బేస్ క్యాంపు ఏర్పాటు చేశారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు అమర్చారు. ఎఫ్ఎస్‌వో మోపత్‌రావు, ఎఫ్‌బీవోలు సాయి, శ్రీనివాస్, రామేశ్వర్, సిబ్బంది కృష్ణ, సోనేరావు గాలిస్తున్నారు. పులి ఆనవాళ్లు కానరానందున ఇప్పుడే ధ్రువీకరించలేమని తెలిపారు. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఈ ప్రాంతానికి పులుల వలస సాధారణమే అని చెప్పారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కౌంటర్ వేసే తీరిక లేదా?

- రెండు వారాల్లో దాఖలు చేయాలి
- కేంద్రం తీరుపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): లైంగికదాడి బాధితులైన మహిళలకు రక్షణ కల్పించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో కౌంటర్ పిటిషన్ దాఖలు చేసేందుకు ఇంకెంత సమయం కావాలని హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నాలుగు నెలలుగా కౌంటర్ దాఖలు చేయకపోవడాన్ని తప్పుపట్టింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. లైంగికదాడి కేసుల్లో దోషిగా తేలిన వ్యక్తికి శిక్ష పడిన మూడు నెలల్లోగా బాధితురాలికి అతని ఆస్తి నుంచి 50 శాతం పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకునేలా కేంద్రానికి, నెల రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ జీ రాధారాణి ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. తెలంగాణలో మహిళలపై నేరాలు పెరగడానికి కారణాలు, వైఫల్యాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ)ను ఆదేశించాలని ఆయన కోరారు. వాదనల తర్వాత కేంద్రానికి నోటీసులు జారీ చేసి విచారణను వచ్చే నెల 4కు హైకోర్టు వాయిదా వేసింది.

పోలీస్ 'భద్రత'పై దిగొచ్చిన ప్రభుత్వం

- తెలంగాణ హాస్పిటల్స్ అసోసియేషన్‌తో చర్చలు
- దశలవారీగా పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ
- పోలీస్ కుటుంబాల దీనస్థితిపై 'నమస్తే'లో కథనాలు
- కృతజ్ఞతలు తెలిపిన పోలీసు అధికారుల సంఘం

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చింది. తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎస్‌హెచ్ఏ) మంగళవారం అటు ప్రభుత్వం నుంచి ఇటు పోలీస్ ఉన్నతాధికారులు, ఆరోగ్య భద్రతా కార్యదర్శి సమక్షంలో జరిపిన చర్చలు సత్ఫలితాన్ని ఇచ్చాయి. దీంతో బుధవారం నుంచి పోలీస్ ఆరోగ్య భద్రతా వైద్యసేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. ప్రతినెలా భద్రతకు, ఆరోగ్య భద్రతకు కలిపి రూ.1,600 (కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ), రూ.3,200 (ఎస్సై నుంచి పైర్యాంకు అధికారులు) నగదు చెల్లిస్తున్నా.. వైద్యం అందకపోవడంపై పోలీసు కుటుంబాల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. 20లోపు పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే వైద్యం చేసేది లేదని టీఎస్‌హెచ్ఏ ఆరో తేదీనే హెచ్చరించినా ముందస్తు చర్చలే జరపలేదు. వారు డెడ్‌లైన్ పెట్టిన నాటినుంచి ఆయా దవాఖానలు పోలీస్ ఆరోగ్య భద్రత సేవలను నిలిపివేశాయి. మరికొన్ని దవాఖానలు ఆరోగ్య భద్రత కింద అడ్మిట్ చేసుకునేందుకు నిరాకరించాయి. ఈ నేపథ్యంలో పోలీసు ఆరోగ్య భద్రత కింద పోలీసు కుటుంబాలు పడుతున్న ఇబ్బందులపై, డెడ్‌లైన్ ముగిసిపోతున్నా చలనంలేని ప్రభుత్వ తీరుపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలను ప్రచురించింది. దీంతో పోలీస్ ఆరోగ్య భద్రత కింద వైద్యం చేసుకుంటున్న పోలీస్ కుటుంబాలెవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని డీజీపీ జితేందర్ 'నమస్తే తెలంగాణ'కు వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో మంగళవారం సచివాయలంలో జరిపిన చర్చలు సత్ఫలితాన్ని ఇచ్చాయి. పోలీసు ఆరోగ్య భద్రత కింద సుమారు రూ.300 కోట్ల బకాయిలను ప్రభుత్వం ఆయా దవాఖానలకు చెల్లించాల్సి ఉన్నది.

ఆరోగ్య భద్రత సేవలు కొనసాగిస్తాం : టీఎస్‌హెచ్ఏ

తెలంగాణ ఆరోగ్య భద్రత కింద నగదు రహిత వైద్యసేవలను యథావిధిగా కొనసాగించనున్నట్టు తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎస్‌హెచ్ఏ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 20న డీజీపీ జితేందర్ రాసిన లేఖ ఆధారంగా జరిపిన చర్చలు సత్ఫలితాన్ని ఇచ్చాయని అసోసియేషన్ పేర్కొన్నది. భారీ బకాయిలను విడతల వారీగా చెల్లించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని తెలిపింది. ఈ మేరకు టీఎస్‌హెచ్ఏ అనుబంధ దవాఖానలు వైద్యం అందించాలని అసోసియేషన్ కోరింది. సమస్యల పరిష్కారానికి ఆరోగ్య భద్రత సిబ్బందితోపాటు టీఎస్‌హెచ్ఏ ఎక్స్‌కాం సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపింది.

పునరుద్ధరణపై పోలీస్ అధికారుల సంఘం కృతజ్ఞతలు

ఆరోగ్య భద్రత సేవల పునరుద్ధరణకు సహకరించిన డీజీపీ జితేందర్ సహా పలువురికి పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై గోపీరెడ్డి, నాయకులు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 20 నుంచి కొన్ని దవాఖానలు వైద్య చికిత్సలను నిలిపివేశాయని తెలిపారు. ఈ నేపథ్యంలో డీజీపీ హాస్పిటల్స్ అసోసియేషన్‌తో సంప్రదింపులు జరిపారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి, తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్, సీనియర్ పోలీసు ఉన్నతాధికారులకు, భద్రత కార్యదర్శికి కూడా ధన్యవాదాలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే

- లేకుంటే స్థానిక ఎన్నికలను అడ్డుకుంటాం
- ప్రభుత్వానికి సర్పంచుల సంఘం జేఏసీ లేఖ

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందేనని, లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామని సర్పంచుల సంఘం జేఏసీ హెచ్చరించింది. ఈ మేరకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాసింది. బిల్లులు చెల్లించేవరకు ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధమని, ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకుంటామని జేఏసీ వెల్లడించింది. ఆర్థిక ఇబ్బందులు తాళలేక మాజీ సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని లేఖలో పేర్కొంది. ప్రాణాలు పోతున్నా బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతున్నదని, బిల్లులు చెల్లించేవరకూ పోరాటం ఆపబోమని స్పష్టంచేసింది.

త్వరలో భూ భారతి మార్గదర్శకాలు

రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): భూ భారతి చట్టం అమలుకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్టు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, భూ భారతి చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ.. 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న చట్టాలను అధ్యయనం చేసిన తర్వాతే దీనిని రూపకల్పన చేసినట్టు వెల్లడించారు. ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే ఇంధనశాఖ లక్ష్యమని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సీఎస్ శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సవ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు దానకిశోర్, రిజ్వీ, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శులు లోకేశ్ కుమార్, యోగితారాణా, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులమా?.. నర్సింగ్ ఆఫీసర్లమా?

- కొడంగల్ మెడికల్ కాలేజీకి 363 పోస్టులు మంజూరు
- నర్సింగ్ ఆఫీసర్లను స్టాఫ్ నర్సులుగా పేర్కొన్న ప్రభుత్వం
- సర్కారు ఆర్డర్‌పై నర్సింగ్ ఆఫీసర్ల మండిపాటు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్న మెడికల్ కాలేజీకి ఆర్థిక శాఖ 363 పోస్టులు మంజూరు చేసింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది. మెడికల్ కాలేజీకి 117 పోస్టులు, కొడంగల్‌లోని ప్రభుత్వ దవాఖానకు 199 పోస్టులు, నర్సింగ్ కా